సాక్షి పెద్దపల్లి

గురువారం । 11 । జూలై । 2024



ఓంకారేశ్వరునికి పూజలు

రామగుండం: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు స్వగ్రామమైన ఆబాది రామగుండంలోని శ్రీఓంకారేశ్వరాలయంలో బుధవారం ప్రత్యేక అభిషేక పూజలు చేశారు.



పట్నాలు.. మొక్కులు

ఓదెల: ఓదెల శ్రీమల్లికార్జునస్వామి సన్నిధిలో బుధవారం భక్తుల రద్దీ పెరిగింది. స్వామివారికి పట్నాలు వేసి మొక్కులు సమర్పించుకున్నారు. అధికారులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/26.0

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా నమోదు అవుతుంది. కొన్నిచోట్ల ఉరుములతో కూడిన మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భూసేకరణ పూర్తిచేయండి



సీఎం కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను ఈనెలాఖరులోగా పూర్తిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా పరిధిలోని అంశాలపై వివరించారు. మంచిర్యాల–వరంగల్ గ్రీన్‌ఫీల్డ్ నాలుగులేన్ల రోడ్డు నిర్మాణం జిల్లాలో సుమారు 37.కి.మీ. వరకు ఉందన్నారు. ఇందుకోసం 204.4 హైక్టార్ల భూసేకరణ చేయాల్సి ఉండగా 196.3కి.మీ. వరకు భూసేకరణ అవార్డుపాస్ చేశామని వివరించారు. చెల్లించిన పరిహారానికి సంతృప్తి చెందని రైతులు.. భూములు అప్పగించడం లేదని, పలుమార్లు చర్చించి ఆర్బిట్రేషన్‌కు వచ్చేలా ఒప్పించామని వివరించారు. పరిహారం విడుదల చేసిన 10రోజుల్లో భూమిని అథారిటీకి అప్పగిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మంథని ఆర్డీవో హనుమానాయక్, డీఎఫ్‌వో శివయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరూ మొక్కలు నాటాలి



నర్సరీ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

రామగిరి(మంథని): వన మహోత్సవం లక్ష్యం పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ సూచించారు. సెంటనరీకాలనీలోని నర్సరీని బుధవారం ఆమె సందర్శించి మొక్క నాటారు. ఆర్జీ–3 ఏరియాకు నిర్దేశించిన 1,75,000 మొక్కల గురించి జీఎం సుధాకర్‌రావును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఈఈ రమణ, ఎంపీడీవో శైలజారాణి, ఎంపీవో సమ్మిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రమ్య, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారి చెక్ పవర్ రద్దు

జూలపల్లి(పెద్దపల్లి): స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంపత్‌రెడ్డి చెక్ పవర్ రద్దు చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. చెక్‌పవర్ రద్దుకు గల కారణాలు తెలియరాలేదు. ప్రత్యామ్నాయంగా జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ మధుకర్ రెడ్డికి చెక్‌పవర్ అప్పగిస్తూ ఉత్తర్వులిచ్చారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

ముత్తారం(మంథని): నాగెపల్లి పంచాయతీ కార్యదర్శి సాగర్‌రావుకు షోకాజ్ నోటీస్ జారీచేస్తూ కలెక్టర్ శ్రీహర్ష బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో సాగర్‌రావు పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధంగా విధులు నిర్వర్తిస్తున్నారని అక్కడి మాజీ సర్పంచ్ సముద్రాల రమేశ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు షోకాజ్ నోటీసు జారీచేశారు.

12న వాహనాల వేలం

పెద్దపల్లిరూరల్: ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను ఈనెల 12న ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ శిరీష బుధవారం తెలిపారు. ఆసక్తి గలవారు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన ధరలో సగం డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని సూచించారు. వేలం పాటలో వాహనం దక్కకుంటే డిపాజిట్ వాపస్ చేస్తామని ఆమె వివరించారు.

జీజీహెచ్‌లో అరుదైన సర్జరీ



శస్త్ర చికిత్స చేసిన వైద్యులు



ఆపరేషన్ తర్వాత పేషెంట్

కోల్‌సిటీ(రామగుండం): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఓ పేషెంట్‌కు గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) వైద్యులు తొలిసారి మారథాన్ ఒరోఫేషియల్ ట్రామా సర్జరీ చేసి రికార్డు సృష్టించారు. రోడ్డు ప్రమాదంలో ఆ వ్యక్తి ముఖంపై ఆరుచోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో జీజీహెచ్‌లో చేర్చుకున్న వైద్యులు.. రక్తపోటుఉన్నా.. అనెస్థీషియా, వైద్యుల బృందం శస్త్రచికిత్స విజయవంతంగా చేశారు. ఆరు మినీప్లేట్ ఇంప్లాంటులు, మరో 20 స్క్రూల ప్లేస్‌మెంట్‌తో ముఖంపై పగిలిన ఆరు పగుళ్లు, కింది దవడను ఓఆర్ఐఎఫ్ చికిత్సతో సరిచేశామని అసోసియేట్ ప్రొఫెసర్ సుమలత వివరించారు. పేషెంట్ ప్రస్తుతం ఆస్పత్రిలో కోలుకుంటున్నారని ఆమె తెలిపారు.



నగరానికి జ్వరం

రామగుండం నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. జ్వరం, వైరల్ ఫీవర్, ఇతర సీజనల్ వ్యాధులతో బాధపడుతూ పేషెంట్లు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల బాటపట్టారు. వారిరాకతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. బుధవారం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రి కిక్కిరిసిపోయింది. వైద్యులను సంప్రదించి తమ బాధలు చెప్పుకునేందుకు గంటల తరబడి నిరీక్షించారు. – కోల్‌సిటీ(రామగుండం)



ఉత్సాహంగా వనమహోత్సవం

గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలు, పండ్ల మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ అధికారి దామెరకొండ శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కటకం అంజయ్య, అధ్యాపకురాలు రజిత, లైబ్రేరియన్ విజయ, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు. – గోదావరిఖనిటౌన్



పార్కింగ్ పరేషాన్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో పార్కింగ్ అస్తవ్యస్తంగా తయారైంది. ఎమర్జెన్సీ వార్డు ద్వారం ఎదుట ద్విచక్రవాహనాలు నిలిపి ఉంచడంతో అంబులెన్స్‌ల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పార్కింగ్ స్థలంలో ఉంచాల్సిన వాహనాలను ఎక్కడపడితే అక్కడ ఇలా పార్క్ చేయడంతో పేషెంట్లు, బంధువులు, సందర్శకులూ ఇబ్బంది పడుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ఎల్లమ్మకు బోనం మొక్కులు



పూజలుచేస్తున్న నందిని, మనాలీఠాగూర్

గోదావరిఖని: బల్కంపేట్ ఎల్లమ్మకు రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలీఠాగూర్ బుధవారం బోనం మొక్కులు సమర్పించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందినితో కలిసి అమ్మవారికి బోనంతో నైవేద్యం సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆస్పత్రులకు సుస్తీ



- నోరు తెరుచుకుని మృత్యుకుహరంగా మారిన మ్యాన్‌హోల్ ఇది. జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ ఎదుట ఉంది. గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో కొత్త భవనం నిర్మిస్తున్నారు. కార్మికులు, పేషెంట్లు, వారి సంబంధీకులు నిత్యం వందల సంఖ్యలో వస్తున్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా అందులో పడితే ప్రాణాలు పోవడం ఖాయం.



గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అత్యంత ప్రమాదకరమైన నీటిగుంత ఇది. క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం కోసం ఆర్నెల్ల క్రితం వాటర్ ట్యాంక్ కూల్చివేశారు. అక్కడున్న సుమారు ఆరు అడుగుల లోతులోని సంపును ఇలా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షపునీటితో నిండి సంపు ప్రమాదకరంగా మారింది. ఇందులో పడితే ప్రాణాలు పోవడం ఖాయం. పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలోని సెప్టిక్ ట్యాంకులో మంగళవారం జాన్‌వెస్లీ అనే బాలుడుపడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అయినా, అధికారులు ప్రమాదకరమైన ఇలాంటి గుంతలు పూడ్చంలో మొద్దునిద్ర వీడడంలేదు.



- ఎన్టీపీసీ నిర్మించిన నిరుపయోగమైన మరుగుదొడ్డు ఇది. గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలోనిది. ఏళ్లుగా వినియోగంలోకి రాకున్నా పట్టించుకున్న నాథుడేలేడు. పెద్దపల్లి ఘటనలో మరుగుదొడ్లకు తాళాలు వేయడంతోనే అక్కడ ప్రమాదం చోటుచేసుకుని బాలుడు దుర్మరణం పాలయ్యాడు.

- ప్రభుత్వ దవాఖానలకు నిర్లక్ష్యపు రోగం
- రూ.లక్షలు వెచ్చించి వైద్య పరికరాలు కొనుగోలు
- నిర్వహణ లోపంతో మూలన పడుతున్న వైనం
- ప్రమాదకరంగా హాస్పిటల్స్ ఆవరణలు

సాక్షి, పెద్దపల్లి: ఆరోగ్య సమస్యలు తలెత్తితే ప్రాణాలు కాపాడుకునేందుకు ఆస్పత్రులకు వెళ్తాం. ఆస్పత్రులే ప్రమాదకరంగా మారితే ఇక ఏం చేయాలి? జిల్లాలోని చాలా ఆస్పత్రుల పరిస్థితి ప్రస్తుతం ఇలా ప్రమాదకరంగానే ఉంది. అంతేకాదు.. పేషెంట్లకు ఎక్కడా పూర్తిస్థాయిలో వైద్యం అందడంలేదు. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఫలితం కనిపించడంలేదు. రూ.లక్షలు వెచ్చించి అత్యాధునిక పరికరాలు కొనుగోలు చేస్తున్నా వైద్యనిపుణులు లేక వృథాగా పడిఉంటున్నాయి. అంతేకాదు.. కొన్నాళ్లకు తుప్పుపట్టి మూలన పడుతున్నాయి. పట్టణవాసులే కాదు.. గ్రామీణులూ వైద్యసేవలు అందక దూరప్రాంతాలు, లేదా ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా చితికి పోతున్నారు.

నిర్లక్ష్యం వీడరు.. తీరు మార్చుకోరు

ప్రభుత్వ ఆస్పత్రుల్లోని కొందరు వైద్యుల పనితీరు విమర్శలకు దారితీస్తోంది. జిల్లాకేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రితోపాటు గోదావరిఖని, మంథని, సుల్తానాబాద్ ఆస్పత్రుల్లోని వైద్యుల పని తీరుపై విమర్శలు వస్తున్నాయి. సమయపాలన పాటించకపోవడం, అత్యవసర సమయాల్లో అందుబాటులో లేకపోవడం పేషెంట్ల ప్రాణాల మీదకు తెస్తోంది. గత నెలలో డెలివరీ సమయంలో వైద్యుల నిర్లక్ష్యంతో బాలుడి చెయి విరగ్గా, ఇటీవల సర్జరీ చేసి కడుపులో దూది మరిచిపోయిన ఘటనలు వైద్యుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. తాజాగా మంగళవారం సెప్టిక్ ట్యాంక్‌లో పడి బాలుడు మృతి చెందడం వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. కొందరు డాక్టర్లు ప్రభుత్వ నుంచి వేతనం తీసుకుంటూ సొంత క్లినిక్‌లో ఎక్కువ సమయం గడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే విషయమై అధికారులను వివరణ కోరగా వైద్యసేవలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.



- సుమారు రూ.25లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ప్లేట్‌లెట్ యంత్రం, 2–డీ ఇకో మిషన్లు ఇవి. జిల్లా కేంద్రంలోని బ్లడ్‌బ్యాంకులో ఇలా మూలనపడేశారు. కనీసం వీటి ముసుగు తీసి వినియోగంలోకి తేవడంలేదు. నిపుణులు లేక వీటిని మూలనపడేశారు.



సాగు భూములకే 'భరోసా'

- వెంచర్లు, కళాశాల భూములకు బంద్
- సాగులోలేని 14 వేల ఎకరాల భూమి గుర్తింపు
- కళాశాలలు, రియల్ వెంచర్లు, గుట్టలకు జీపీఎస్ మార్కింగ్
- వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అధికారులు
- సాగు, భూపరిమితులపై 19న ప్రజాప్రతినిధులతో భేటీ
- ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరుల అభిప్రాయ సేకరణ



సాక్షిప్రతినిధి,కరీంనగర్: రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతుబంధు గతంలో దుర్వినియోగానికి గురైంది. పలువురు తమ రియల్ వెంచర్లు, గుట్టలు, రోడ్లు, కళాశాలలకు కూడా ఎకరానికి రూ. ఐదువేల చొప్పున రైతుబంధు తీసుకున్నారు. తాజా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సాయాన్ని ఎకరానికి రూ.7500 చేసింది. అమలు చేసే ముందు క్షేత్రస్థాయిలో పారదర్శకత ఉండేలా సాగులో ఉన్న భూమికే ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జూలై 3వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా శాంపిల్ సర్వే కింద ఐదు జిల్లాల్లో ఓ సర్వే నిర్వహించింది. అందులో కరీంనగర్ కూడా ఉంది. దీనికి గతేడాది వర్షాకాలంలో సాగుచేసిన పంటలను ప్రామాణికంగా తీసుకుని తిరిగి 'ల్యాండ్ యుటిలైజేషన్ సర్వే ఫీల్డ్ వెరిఫికేషన్' పేరిట సర్వే చేశారు. ఈ సర్వే ఆధారంగానే రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందించనుంది.

కరీంనగర్‌లో 14,100 ఎకరాలు

రాష్ట్రవ్యాప్తంగా సాగులో లేని దాదాపు 20లక్షల ఎకరాల వివరాలు సర్వే చేయగా, అందులో కరీంనగర్‌లో 3.40 లక్షల ఎకరాలకుపైగా సాగుభూమిలో దాదాపు 51,000 అనుమానాస్పద ఎకరాలను గుర్తించి సర్వే చేశారు. వీటిని ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేశారు. అందులో గుట్టలు, కొండలు, రోడ్లు, బంజరుభూమి, రియల్ వెంచర్లు, కళాశాలలు తదితర ఆప్షన్లు ఉన్నాయి. ఈ క్రమంలో కరీంనగర్‌లో దాదాపు 14,100 ఎకరాల భూమి సాగులో లేదని గుర్తించారు. అందులో అధికశాతం రియల్ ఎస్టేట్ వెంచర్లు, కళాశాలలు, కొండలు, బంజరు భూములు ఉన్నాయి. వీటిని ఆన్‌లైన్‌లో జీపీఎస్ ద్వారా మార్కింగ్ చేశారు. ఇక మీదట వీటిని వ్యవసాయాధికారులు చూసినప్పుడు అది సాగుభూమా? ఇతరత్రా అన్నది స్పష్టంగా తెలుస్తుంది. సాగుభూమి అయితే రైతు భరోసాకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

19న ప్రజాప్రతినిధులతో భేటీ

రైతుభరోసా అమలు చేసేందుకు ఈనెల 19 మంత్రివర్గ ఉపసంఘం కరీంనగర్ జిల్లాలో పర్యటించనుంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇందులో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని 13 నియోజవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్, పీఏసీ చైర్మన్లు, వ్యవసాయ అనుబంధ సొసైటీ ప్రతినిధులతో మంత్రివర్గ ఉపసంఘం భేటీ అవుతుంది. వీరినుంచి అభిప్రాయాలు సేకరిస్తుంది. పెట్టుబడి సాయం రూ.5000 – రూ.7500కు పెంచుతున్న క్రమంలో సాగు పరిమితి, భూ పరిమితిపై అభిప్రాయాలు సేకరించనున్నారు. సాగు భూమికి ఎన్ని ఎకరాలకు సీల్ విధించాలి? ఎంత భూమికి రైతుభరోసా చెల్లించాలి? అన్న విషయాలపై అభిప్రాయాలు తీసుకోనున్నారు. ఇందుకోసం కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు జిల్లా వ్యవసాయాధికారుల(డీఏవో)లు ఇప్పటికే వ్యవసాయ భూముల పరిస్థితిపై నివేదికలు సిద్ధం చేశారు. వీరికి కరీంనగర్ జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు.

అదేరోజు నివేదిక పంపిస్తాం

19న మంత్రివర్గ ఉపసంఘం ప్రజాప్రతినిధులతో సమావేశం అవుతారు. వీరితోపాటు వివిధ వర్గాల అభిప్రాయలు సేకరిస్తారు. సమావేశానికి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, సొసైటీల చైర్మన్లు, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల వ్యవసాయాధికారులు కూడా హాజరవుతారు. అదే రోజు సాయంత్రం సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపిస్తాం.

– శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి

పారిశుద్ధ్యం ఇంత అధ్వానమా?

- 'సాక్షి' కథనానికి స్పందన
- అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఆగ్రహం

స్పందన



మురుగునీటిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరంలో పారిశుద్ధ్యం నిర్వహణ గాడితప్పిన తీరుపై అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పత్తాలేని ఫాగింగ్' శీర్షికన బుధవారం 'సాక్షి' ప్రచురించిన కథనానికి అరుణశ్రీ స్పందించారు. వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. ఇందిరానగర్‌లోని మురుగునీటి లీకేజీని పరిశీలించారు. తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అప్పటికప్పడే సిబ్బందితో మురుగును శుభ్రం చేయించారు. శాశ్వతపు పరిష్కారం తీసుకునేంత వరకు తాత్కాలిక చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో యజమానికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. నగరంలో యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని సూచించారు. ఫాగింగ్ చేపట్టకపోవడానికిగల కారణాలు, పనిచేస్తున్న యంత్రాలు తదితర వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బల్దియా సెక్రటరీ రాజు, ఈఈ రామన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, శంకర్‌రావు, ఆడెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామాజిక సేవలో అగ్రగామి లయన్స్ క్లబ్



కృత్రిమ అవయవాలు పొందినవారితో ప్రతినిధులు

గోదావరిఖని: సామాజిక సేవలో అగ్రగామిగా రామగుండం లయన్స్‌క్లబ్ నిలుస్తోందని డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్.వెంకటేశ్వర్‌రావు, రామగుండం క్లబ్ అధ్యక్షుడు పి.మల్లికార్జున్ అన్నారు. బుధవారం బాధితులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేసి మాట్లాడారు. రామగుండంప్రాంతంలో గ్రామాలు, వీధులే కాకుండా నిరుపేదలు ఎక్కడున్నా ఆదుకోవాలనేది తమ లక్ష్యమన్నారు. నిత్యం అన్న ప్రసాదం, ఉచితంగా కంటిఆపరేషన్లు చేయడంతోపాటు కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యదర్శి వి.ఎల్లప్ప, కోశాధికారి గోవర్ధన్‌రెడ్డి, ప్రతినిధులు మేడిశెట్టి గంగాధర్, బంక రామస్వామి, తిలక్ చక్రవర్తి, శరత్‌బాబు, పోకల ఆంజనేయులు, డాక్టర్ వెంకటేశ్వర్లు, మనోజ్‌కుమార్ అగర్వాల్, గోపాల్ త్రివేది, బంక కళావతి, కజంపురం జయప్రద, మనీషా అగర్వాల్, ఉమారాణి పాల్గొన్నారు.

లక్ష్యం ఒకటే.. ఏకతాటిపైకే రాలే..

- బొగ్గు బ్లాక్‌ల వేలంపై కార్మిక సంఘాల ఆగ్రహం
- ఐక్య పోరాటాలకు పిలుపునిస్తున్న నాయకులు
- ఎవరికి వారే ప్రత్యక్ష ఆందోళనలు చేస్తున్న వైనం

గోదావరిఖని: బొగ్గు గనుల ప్రైవేటీకరణపై సింగరేణిలో ఉద్యమం ఉధృతమవుతోంది. లక్ష్యం ఒకటే అయినా కార్మిక సంఘాల్లో ఐక్యత లోపిస్తోంది. బొగ్గు గనుల సంస్థను కాపాడుకునేందుకు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని అందరు నేతలు ఆకాంక్షిస్తున్నా.. ఆచరణలో ఏకతాటిపైకి రావడంలేదు. సంస్థలోని అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడితేనే ఫలితాలు అద్భుతంగా ఉంటాయని పలువురు కార్మికులు అభిప్రాయపడుతున్నారు.

ఆజ్యం పోసిన బొగ్గు బ్లాక్‌ల వేలం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని సింగరేణి సంస్థకు చెందిన బొగ్గు బ్లాక్‌లను టెండర్ ప్రక్రియ ద్వారా ముందుకు వచ్చే సంస్థలకు కేటాయించేందుకు నిర్ణయించారు.
- దీనిని వ్యతిరేకిస్తూ సింగరేణిలోని జాతీయ, విప్లవ కార్మిక సంఘాలు, టీబీజీకేఎస్ ఐక్య ఉద్యమాలకు పిలుపునిచ్చాయి.
- అవసరమైతే సమ్మెకైనా సిద్ధమేనని ఇప్పటికే ప్రకటించాయి.
- తమతో కలిసివచ్చే యూనియన్లతో ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించాయి.
- ఐక్య ఉద్యమాలకు కలిసి రావాలని అన్ని కార్మిక సంఘాలు ఎవరికి వారే విజ్ఞప్తి చేస్తున్నా ఏకతాటిపైకి మాత్రం రావడం లేదు.
- ఈసారి కేంద్రప్రభుత్వం నిర్వహించే టెండర్లలో రెండు బ్లాకులను వేలం ద్వారా అప్పగించేందుకు నిర్ణయించారు.
- ఇది అమలైతే సంస్థ ఉని ప్రశ్నార్థకంగా మారుతుందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.
- ఈక్రమంలో రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని పూర్తిగా రద్దు చేసి బేషరతుగా సింగరేణి సంస్థకే కేటాయించాలని కార్మిక సంఘాలు, ప్రధాన రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.



- ఇందులో జాతీయ కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్ ఇప్పటికే దశలవారీగా ఆందోళనలు ఉధృతంగా చేస్తున్నాయి.
- ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి అనుంధ సంఘం బీఎంఎస్ తన వైఖరిని ఇంత వరకు ప్రకటించలేదు.
- ఏఐటీయూసీ మూడ్రోజులుగా జీఎం కార్యాలయాల ఎదుట రిలేనిరాహార దీక్షలు చేస్తోంది.
- అదేబాటలో ఐఎన్‌టీయూసీ ధర్నాలు చేస్తోంది.
- హెచ్‌ఎంఎస్ విప్లవ కార్మిక సంఘాలతో కలిసి హైదరాబాద్‌లో ఇటీవల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది.
- సీఐటీయూ నాయకులు తాము కూడా పోరాటాలకు సిద్ధమని ప్రకటించారు.
- పదేళ్లపాటు సింగరేణిలో గుర్తింపు యూనియన్‌గా వ్యవహరించిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్) సైతం జీఎం కార్యాలయా ఎదుట ఆందోళనలు నిర్వహించింది.
- దశల వారీగా ఆందోళనలు ఉధృతం చేయాలని నిర్ణయించింది.

ఒకేవేదికపైకి వచ్చేదెన్నడో..?

సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణపై పోరుసల్పాలనేది అన్ని కార్మిక సంఘాల లక్ష్యం. అయినా, ఇవన్నీ ఇప్పటికీ ఒకే వేదికపై రావడంలేదు. సకల జనుల సమ్మె, కార్మికుల హక్కుల సాధన కోసం రెండేళ్ల క్రితం నిర్వహించిన సమ్మెలో అన్ని యూనియన్లు ఏకతాటిపైకి చేరాయి. ఈసారి 'ఎవరకి వారే.. యమునాతీరే' చందంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. మూడ్రోజుల క్రితం ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్ నేతలు కలిసి బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కేంద్రప్రభుత్వం కూడా ప్రైవేటీకరణ రద్దుపై సానుకూల వైఖరితో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈక్రమంలో అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా ముందుకు సాగితే భవిష్యత్ సవాళ్లను విజయవంతంగా ఎదుర్కోవచ్చని కార్మికులు అభిప్రాయపడుతున్నారు.

క్లుప్తంగా

సెప్టిక్ ట్యాంకులో పడిన బాలుడి మృతి

పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ఆవరణ సెప్టిక్ ట్యాంకులో మంగళవారం పడ్డ జాన్‌వెస్లీ(9) కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. మలవిసర్జనకు వెళ్లిన బాలుడు.. ప్రమాదవశాత్తు సెప్టిక్ ట్యాంకులో పడ్డ విషయం తెలిసిందే. అయితే సెప్టిక్ ట్యాంకుపై మూత వేయడంలో శానిటేషన్ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యం ఉందని, దీంతోనే ప్రమాదం జరిగిందనే నిర్ధారణకు వచ్చి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ప్రజా సమస్యలపై పోరాటం

కమాన్‌పూర్(మంథని): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసేందుకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు కోరారు. దేవునిపల్లెలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ మధు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారం కోసం పోరాటం చేయాలని సూచించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వే అధికారుల బదిలీ

గోదావరిఖని: సర్వే అధికారులను బదిలీ చేస్తూ సింగరేణి బుధవారం ఆదేశాలు జారీచేసింది. సంస్థవ్యాప్తంగా నలుగురు అధికారులను బదిలీ చేశారు. సీనియర్ సర్వే అధికారి ఎండీ నజీరుద్దీన్‌ను మందమర్రి ఆర్కేపీ ఓసీపీ నుంచి కేకే-5వ గనికి బదిలీ చేశారు. సర్వే అధికారి పి.రాజశేఖర్‌ను బెల్లంపలి ఏరియా ఖైరిగూడ ఓసీపీ నుంచి మణుగూరు ఏరియా పీకే ఓసీపీకి బదిలీ చేశారు. సర్వే అధికారి పెంద్యాల ప్రభాకర్‌ను మందమర్రి ఏరియా ఆర్కేపీ-1వ గని నుంచి అదే ఏరియా కాసిపేట గనికి బదిలీ చేశారు. సర్వే అధికారి దొంతల ప్రకాశ్‌ను మణుగూరు ఏరియా పీకే ఓసీ నుంచి కొత్తగూడెం ఏఎస్‌వోకు బదిలీ చేశారు. బదిలీ అయిన అధికారులు ఈనెల 20లోగా బదిలీ అయిన ప్రాంతాల్లో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

బాలకార్మికులపై స్పెషల్ ఫోకస్

- ఆపరేషన్ ముస్కాన్-10 విజయవంతానికి ప్రణాళిక
- పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో రెండు ప్రత్యేక బృందాలు

ఆపరేషన్ ముస్కాన్ -10 అధికారుల ఫోన్ నంబర్లు

పెద్దపల్లి సబ్‌డివిజన్ ఇన్‌చార్జి ఎస్సై
87126 56507

గోదావరిఖని సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఎస్సై
98855 08894



గోదావరిఖనిలోని ఓ వ్యాపార సముదాయంలో తనిఖీ చేస్తున్న ప్రత్యేక బృందాలు

గోదావరిఖని: పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఆపరేషన్ ముస్కాన్-10ని విజయవంతం చేసేందుకు రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో రెండు ప్రత్యేక బృందాలను నియమించారు. ఆడుతూ పాడుతూ ఆనందంగా సాగాల్సిన బాల్యానికి అందమైన జీవితం ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. పలకాబలపం పట్టుకుని బడికి వెళ్లాల్సిన చిన్నారులు.. కుటుంబ సమస్యలు, పేదరికంతో బాలకార్మికులు మారుతున్నారని గుర్తించి ఆ వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

రెండు జిల్లాల్లో తనిఖీలు..

- రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రెండు జిల్లాల్లో పనిచేస్తున్న బాలకార్మికులను గుర్తించేందుకు పోలీసులు, సంబంధిత శాఖల అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నాయి.
- బాలకార్మికులు కనిపిస్తే వారిని పనిలో పెట్టుకున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాయి.
- ఆ తర్వాత చిన్నారులను బడిలో చేర్పిస్తున్నాయి.
- ఈసారి కూడా ఆపరేషన్ ముస్కాన్-10 పేరిట స్పెషల్ డ్రైవ్ చేపట్టాయి.
- ఈనెలాఖరు వరకు వివిధ శాఖల సమన్వయంతో ప్రత్యేక బృందాలు బాలకార్మికులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యాయి.
- ముఖ్యంగా ఇటుక బట్టీలు, హోటళ్లు, షాపులు, మెకానిక్ షెడ్లు, ఇతర ప్రదేశాల్లో పనిచేస్తున్న వారిని గుర్తించి బాల్యాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాయి.
- ఇలా గడిచిన ఏడేళ్లలో పెద్దపల్లి జిల్లాలో 742మంది బాలకార్మికులను పోలీసు యంత్రాంగం గుర్తించింది. వీరందరినీ బాలకార్మిక వ్యవస్థ నుంచి విముక్తుల్ని చేసింది.

పలుశాఖల సమన్వయంతో..

పోలీసుశాఖ వివిధ శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ చేపట్టింది. ఇందులో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్, ఎడ్యుకేషన్, చైల్డ్ ప్రొటెక్షన్, హెల్త్ డిపార్ట్‌మెంట్ల అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బృందాలను నియమించారు. సబ్ డివిజన్ల వారీగా ప్రోగ్రాం ఇన్‌చార్జిలుగా ఎస్సైస్థాయి అధికారులను నియమించారు. వీరు తమ పరిధిలోని పట్టణ, నగర ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జీలు, షాపులు, మెకానిక్ షెడ్లు, ఇటుక బట్టీలు, ఇతర ప్రదేశాల్లో పర్యటిస్తూ బాలకార్మికులను గుర్తిస్తున్నారు.

ఏడేళ్లలో పోలీసులు పట్టుకున్న చిన్నారులు			
ఏడాది	బాలురు	బాలికలు	మొత్తం
2017	206	48	254
2018	88	04	92
2019	116	39	155
2020	66	05	71
2021	88	13	101
2022	21	11	32
2023	33	04	37

యజమానులు ఇలా చేయాలి..

- ×మావద్ద బాలకార్మికులు లేరు× అనే బోర్డులను దుకాణాల ఎదుట ఏర్పాటు చేయించనున్నారు.
- గతంలో నమోదైన కేసుల ఆధారంగా పిల్లలు పనిచేస్తున్న హాట్‌స్పాట్‌లపై ప్రత్యేక బృందాలు దృష్టి సారిస్తాయి.
- గతంలో రెస్క్యూ చేసిన పిల్లల ప్రస్తుత పరిస్థితిని తెలుసుకుంటాయి.

పనిలో పెట్టుకుంటే చర్యలు



చిన్నారులతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఇందుకోసం సబ్ డివిజన్ పరిధిలో ఒక ఎస్సై, నలుగురు సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. బాలకార్మికుల గురించి తెలిస్తే సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఆఫీసర్ లేదా, 1098, డయల్ 100 నంబరు, లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి.
– శ్రీనివాస్, రామగుండం పోలీస్ కమిషనర్

- డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి మళ్లీ స్కూళ్లు, కాలేజీల్లో చేర్పిస్తాయి.
- ఆరోగ్యం బాగాలేని వారిని ఆస్పత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తాయి.
- బాల్య వివాహాలతో కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పిస్తాయి.
- గొర్రెలు, మేకలు, పశువుల కాపరులుగా పనిచేస్తున్న వారిని, నా అనేవారు ఎవరులేని చిన్నారులను గుర్తించి ప్రభుత్వ స్టేట్ హోంకు పంపిస్తాయి.
- భిక్షాటన చేసేవారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగిస్తాయి.
- కుటుంబాల నుంచి విడిపోయిన, తప్పిపోయిన పిల్లలను గుర్తించడానికి దర్పణ్ అనే ఫేషియల్ రికగ్నైజేషన్ అప్లికేషన్ ఉపయోగిస్తున్నారు.

కాంట్రాక్టర్ల వేధింపులు భరించలేకపోతున్నం

- రామగుండం సీపీకి బాధితుడి ఫిర్యాదు

గోదావరిఖని: మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి కాంట్రాక్టర్ల వేధింపులు భరించలేకపోతున్నామని బాధిత కాంట్రాక్టర్ నూనేటి సతీశ్‌కుమార్‌యాదవ్ బుధవారం పేర్కొంటూ రామగుండం సీపీ శ్రీనివాస్‌క్ ఫిర్యాదు చేశారు. గోదావరిఖనికి చెందిన తాను శ్రీరాంపూర్ ఏరియాలో మరో ఇద్దరు కాంట్రాక్టర్లు కుర్మ సతీశ్, కొలిపాక శ్రీనివాస్‌రెడ్డి భాగస్వామ్యంతో కొన్నేళ్లుగా కాంట్రాక్టు పనులు చేస్తున్నామన్నారు. రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన అసోసియేషన్ ఆధ్వర్యంలోనే పనిచేయాలని సూచించారని అన్నారు. అసోసియేషన్ తీరును వ్యతిరేకిస్తూ తాము లేఖ రాసినా.. నాయకుల నుంచి స్పందన రాలేదన్నారు. దీంతో సొంతంగా ఆన్‌లైన్ ద్వారా టెండర్లు పొంది పనులు చేస్తున్నామని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కొందరు కాంట్రాక్టర్లు తమపై కక్షసాధిస్తున్నారని ఆరోపించారు. స్థానికేతరులు ఇక్కడ పనిచేస్తే బాగుండదని బెదిరిస్తున్నారని ఆవేదన చెందారు. ఈక్రమంలో తీవ్ర మానసిక వేదనకు గురైన తన తోటి కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం గుండెపోటుకు గురై మరణించాడని అన్నారు. బెదిరింపులతోపాటు వేధింపులకు గురిచేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని తమను కాపాడాలని సీపీకి ఫిర్యాదు చేసినట్లు కాంట్రాక్టర్ వెల్లడించారు.

తహసీల్ ఎదుట ధర్నా

పెద్దపల్లిరూరల్: మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి ఆరోపించారు. బొగ్గు బ్లాకుల వేలాన్ని వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనాలను రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. నాయకులు వెంకటస్వామి, సాగర్, వనజారాణి, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యావరణ ప్రేమికుడు 'గీట్ల'

గోదావరిఖని: పర్యావరణ ప్రేమికుడు గీట్ల జనార్దన్‌రెడ్డి అని, పర్యావరణ పరిరక్షణకు ఆయన కృషి మర్చిపోలేనిదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. జనార్దన్‌రెడ్డి జయంతి సందర్భంగా బుధవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జీపీపీ పీపీజీ ద్వారా గీట్ల వేలాది మొక్కలు నాటించారని గుర్తుచేశారు. నాయకులు లైశెట్టి రాజయ్య, అచ్చె వేణు, నూతి తిరుపతి, సింహాచలం, రత్నాకర్, శ్రీనివాస్, రమేశ్, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

షోరూమ్‌లకు జరిమానా

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న రెండు వాహన షోరూమ్‌లకు బల్దియా అధికారులు జరిమానా విధించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు హెల్త్ అసిస్టెంట్ కిరణ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ లేని ఆదర్శ టీవీఎస్ షో రూమ్‌కు రూ.5,000, ఫ్రెండ్స్ రాయల్ ఈవీ బైక్ షో రూమ్‌కు రూ.2,000 జరిమానా విధించారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే జరిమానాతోపాటు షాప్ సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

క్రమశిక్షణతో ఉండాలి

రామగిరి(మంథని): వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. సుమారు 88 మందికి బుధవారం కారుణ్య నియామక ఉద్యోగ ఉత్తర్వులను అందజేశారు. వీరంతా స్థానిక ఎంవీటీసీలో శిక్షణ పొందుతున్నారు. జీఎం శిక్షణ తరగతులు పరిశీలించారు. అనంతరం అవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ఎంవీటీసీ మేనేజర్ మల్లన్న, డీవైఎస్ఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం శ్రమిస్తే గుర్తింపు

మంథని: పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన అసెంబ్లీస్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్నారు. అధికార కాంగ్రెస్‌కు ధీటుగా పార్లమెంట్ ఎన్నికల్లో రెండోస్థానంలో నిలిపి పార్టీ పటిష్టకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. నాయకులు గోమాస శ్రీనివాస్, చల్ల నారాయణరెడ్డి, వెంకటేశ్‌గౌడ్, గుండబోయిన లక్ష్మణ్, కొండపాక సత్యప్రకాశ్, మోహన్‌రావు, నాంపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో 9మంది వైద్యుల బదిలీ

గోదావరిఖని: సింగరేణిలోని 9మంది వైద్యులను బదిలీ చేస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు బుధవారం ఉత్తర్వులు జారీఅయ్యాయి. ఈనెల 20లోగా బదిలీ అయిన స్థానాల్లో రిపోర్టు చేయాలని వైద్యులను ఆదేశించింది. బి.అంబిక ఆర్జీ-1 నుంచి బెల్లంపల్లి, డి.లలిత బెల్లంపల్లి నుంచి కొత్తగూడెం, జీవీ నర్సింహారావు కొత్తగూడెం నుంచి ఇల్లెందు, ఎం.గౌతమి ఆర్జీ-2 నుంచి ఆర్జీ-1, జేఏ రవికుమార్ మణుగూరు నుంచి కొత్తగూడెం, బీఎస్‌కే సులోచన మణుగూరు నుంచి కేకే-1 డిస్పెన్సరీ, రెబ్బ శైలజ కేకే-1, మందమర్రి నుంచి ఆర్జీ-2, బి.జెత్రం రుద్రంపూర్ కొత్తగూడెం, ఆర్.శ్రీకాంత్ మందమర్రి ఆర్కేపీ నుంచి ఆర్జీ-1కు బదిలీ అయ్యారు.

సాగునీటి కాలువలు అస్తవ్యస్తం



ఇది ఎస్సారెస్పీ డీ-83 ప్రధాన కాలువ. పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట శివారులోనిదీ దృశ్యం. పిచ్చిమొక్కలు, తుంగ, ముళ్లపొదలతో నిండిపోయింది. ఆయకట్టుకు చుక్క నీరు కూడా అందడకుండా పోతోంది.



ఇది ఎస్సారెస్పీ డీ-83 ప్రధానకాలువ. తుర్కలమద్దికుంట నుంచి ఎం-18ఆర్ ఉపకాలువ ద్వారా నిట్టూరు తదితర గ్రామాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేయాల్సి ఉంది. నిర్వహణ లోపంతో కాలువ అస్తవ్యస్తంగా మారింది.

- నిర్వహణ లోపమే ప్రధాన కారణం
- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- ఆందోళనలో అన్నదాతలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని శ్రీరాంసాగర్ కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఫలితంగా కాలువల ద్వారా చివరి ఆయకట్టుకు చుక్కనీరు కూడా అందకపోవడతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఎస్సారెస్పీ డీ-83, డీ-86 ప్రధాన కాలువలు, వాటి ఉప, అనుబంధ కాలువల ద్వారా జిల్లాలోని సుమారు 2.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

చివరి భూములకు నీరేది?

- శ్రీరాంసాగర్ కాలువల ద్వారా చివరి ఆయకట్టులోని పంటలకు సాగునీరు అందడం లేదు.
- గత యాసంగి సీజన్‌లో పంటలు సాగుచేసే సమయంలో సాగునీటి కోసం చాలా గొడవలు జరిగాయి.
- కాలువ ఎగువన ఉన్న తూముల నుంచి ఇతర ప్రాంతాలకు చెందిన రైతులు సాగునీటిని తరలించుకుపోవడం, వారి ప్రయత్నాలను ఆయకట్టు చివరి ప్రాంతంలో పంటలు సాగు చేసేరైతులు అడ్డుకోవడం ఘర్షణలకు దారితీసింది.

వానాకాలం సాగు విస్తీర్ణం ఇలా(ఎకరాల్లో)	
వరి	2,09,381
పత్తి	57,704
మక్క	780
ఉద్యాన	8,928

పూడికతీత, పిచ్చిమొక్కలు తొలగిస్తేనే..

శ్రీరాంసాగర్ కాలువల్లో పేరుకుపోయిన పూడిక, పిచ్చిమొక్కలు, తుంగ, ముళ్లపొదలను తొలగిస్తే సాగునీటి పారకం సులువుగా దిగువకు వెళ్తుంది. తద్వారా ఆయకట్టు చివరి ప్రాంత వ్యవసాయ భూములకు నీరు అంది రైతులకు మేలు కలుగుతుందనే అభిప్రాయాలున్నాయి. పిచ్చిమొక్కలు అడ్డుపడడంతో సాగునీరు వృథా అవుతోంది.

కూలీలతో తొలగించలేం..

ఎస్సారెస్పీ కాలువల్లో పెరిగిన ముళ్లపొదలను చాలావరకు తొలగించాం. తుర్కలమద్దికుంటలోని ప్రధాన కాలువ, ఉపకాలువల్లో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, తుంగ పెద్దసైజులో ఉన్నాయి. వాటిని యంత్రాల సాయంతో తొలగించాల్సి ఉంది.
– రవీందర్, డీఆర్డీవో